# రాత్రి 9 గంటలకు

(ఒక పట్టణంలో మనుష్యుల మనస్సుల ఊహల
మాటల కోలాహల హాలాహలం.)

ఒక సందులో ఒక చిన్న యింట్లోంచి – "అమ్మా, భయం వేస్తోంది. ఈ రోగం యింక తగదే. అమ్మా కావిలించుకోవే చచ్చి పోకుండా. బాబోయ్ డాక్టరు దున్నపోతు ఎక్కివస్తున్నాడు. స్టెతస్కోపు పాశంలా విసురుతున్నాడమ్మా."

ఒక రోడ్డు మొగని ఆధునిక కవి :

"గంటల కారు చప్పుడు, పక్కవూరు అంటుకుందని విన్నప్పుడు అరెరె పాపం! అరెరె ఏమిటి ఉపద్రవం! టాక్సీ చేయించుకువెళ్ళి చూసి వద్దామా భాయి? ఆ జ్వాలా మహోత్సవాన్ని చూస్తే వండ్రఫుల్ వచన పద్యం ఒకటి వస్తుంది. హుతాశన కృతాశన గృహ గృహ కర్పూరభస్మం నా పద్యం...."

ఒక యింటి అరుగుమీదనుంచి లోపల వంటింట్లోకి కేక –

"ఒసేవ్, నాకు కందిపచ్చడి అంటే యిష్టం."

ఒక రసపిపాసువు మరొకడితో –

"బలే బలే! పద్మిని ఎంత మజాగా వుందిరా జీస్ జిస్.... ఏమిటో దాని పేరు.... జలాంతర క్రీడా సమయ బహిర్గతజంఘాది సురమ్యా పద్మినీ పద్మినీ.... పిక్చరు ఏదో దొంగల్ని గురించిట. అయినా వెధవ కథా కమామిషు ఎవడిక్కావాలి?"

పక్కనున్న పాతిక వోల్టు విద్యుద్దీపకాంతిని కమ్మేస్తూ ఒక షావుకారు దోవనపొయ్యే చలమయ్యతో –

"రేపు మా బామ్మర్ది చెల్లెలు కొడుకు పెళ్ళి. గొప్ప విశేషాను, అంటే మా అబ్బిగాడిదే. కట్నం పందొమ్మిదివేల ఎనభై ఒక్క రూపాయి నాలుగు పైసలు. పై రూపాయీ నాలుగు పైసలూ బామ్మర్ల్లకి సంభావన యిచ్చేస్తాను. ఏది శాశ్వతం లేదూ! అయినా ఆ మాత్రం దానం సెయ్యకపోతే బెడిసికొడుద్ది సెలమయ్యా."

ఆశావాది అయిన ఓ గుమాస్తా తన మిత్రుడితో –

"చస్తే రోల్సు రాయిస్ కిందపడి చావాలి. ప్రాణం ఎంత మెత్తగా హాయిగా పోతుంది. ఎంత గొప్ప! అబ్బ తలచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది."

ఒక క్లబ్బులోంచి –

"మూడు జోకర్లు కల్సినా డిక్ అవలేదు. బాడ్ లక్. ఇంకొక బ్రాంది సోడా.... బోయ్!"

ఒక డాబా పిట్టగోడ నానుకు నించున్న ఒకావిడ పక్క డాబా మీదున్న మరో ఆవిడతో –

"ఏమోయ్, చంద్రుడెంత బాగున్నాడో ఆకాశంమీద. మన వీధి మొగని కిళ్ళీకొట్లో ఉన్న గిరజాల అబ్బాయిలాగ."

ఒక మధ్యతరగతి యింట్లోంచి –

"ఏమండీ నా మాట వినండీ. సానికొంప కెళ్ళకండీ. మీ పాదా లట్టుగుంటాను. మీ పిల్లల్ని చూడండి. వీళ్ళ గతేం కాను? అబ్బ కొడతారేవండీ, పోనీ కొట్టండి. చంపండి. నా రక్తాన్ని మీ చేతులకు రాసుకుని మీ ప్రియురాలి పెదాలకు రాయండి. ఎర్రగా వుంటాయి చప్ప రించేందుకు. హరి భగవంతుడా స్త్రీకి మొగుడు వెధవే గతికదా....!"

ఓ రిక్షావాడు –

"సైడు సైడూ. తప్పుకోవయ్యో బాబూ. ఈ రిక్షా అంటే ఎం టనుకున్నావ్. యిమానంలాగ ఎగురి. దీని తస్సా మంచూ గబుక్కున యాక్షన్ డౌనయిపోయిందిగాని, లేందే డబుల్ టూకీ రెండొంచలు కొట్టి ఉండేవాణ్ని బాబయ్యా. రిక్షాలాగే యోగంవుంటే అంకె ఎందుకు తగు ల్తది, దొంగనాయెదవ మార్కెట్టు!"

ఒక కాలేజీ విద్యార్థిని స్నేహితురాలితో –

"అవిగో గుళ్ళో గంటలు. కార్తీకమాసం వెన్నెల. దేవుడి ప్రసాదం పెడతారు రావే సుజాతా. (మెల్లగా) మన క్లాస్‌మేట్ మురళీ ధరరావు... అబ్బ వాడే పొడుగా. ఎర్రగా టక్ అప్ చేసుకునీ....ఆ మధ్య రిబ్బను పంపాడూ....వాడూ ప్రతీరోజూ వస్తాడే. వాడికీ మనలాగే ఎంతో భక్తి పాపం!"

ఒక కోతలరాయుడు –

నాకు స్పోర్ట్సు అంటే చాలా యిష్టమండీ. క్రికెట్, బేస్‌బాల్, పోలియో తెగ ఆడేసేవాణ్ని నా చిన్నప్పుడు."

ఒక లౌడ్‌స్పీకరులోంచి.

"అఖిలాంధ్ర సాహితీ సమావేశం....మంత్రిగారు అధ్యక్షులు— మ్యునిసిపల్ చైర్మన్‌గారు ప్రారంభకులు....చాంబర్ ఆఫ్ కామర్సు ఉపాధ్యక్షుల ఉపన్యాసం 'సాహిత్య వ్యాపారమూ లాభనష్టాల పరీక్ష....' మహాకవి 'శాతకర్ణి' 'తాజా రచన' కీర్తిపథంలో పరుగెత్తే స్తోత్రరథం నుండి రసవత్తర ఘట్టాల కావ్య పఠనం."

ఒక పాత్రికేయుడు తన గదిలో వ్రాసుకుంటూ –

"ఊరికి కరణమూ, భాషకి వ్యాకరణమూ ప్రబల శత్రువులు."

ఒక ఖైదీ –

"ఈపాటికి వంతెన క్రింద ఓ చుక్కేసి మనోళ్ళతో మాంచి సరదాగా వుండేవాణ్ని. కొండమీద సెంద్రుడు గిద్రున తిరుగుతూండేవాడు రంగులరాటంలాగ! ఇప్పు దెదవ బ్రతుకు కటకటాల యెనక్కి తోసేసారు.... అయినా వూరికినే.... దేపుడితోడు.... వూరికినే కొడవలితో ఇలా అన్నానో లేదో యెదవ అర్భకం ముండ అదేరా నా పెళ్ళాం - కళ్ళు తేలేసి టపీమని సచ్చిపోయింది. పికతెగి పిట్టలా కొట్టుకుంది. ఏంటోగాని నా కప్పుడు మాత్రం శానా కట్టమనిపించిందిరా. ఆ యెద్రి బాగుళ్లి యేపుగా సాపుగా వుండేది పికిలిపిట్టలాగు. ఏమైతేనేం యిప్పుడిక్కడ జెల్లోపడి సత్తున్నా ఓ సుక్కైనా లేక...."

ఓ మన స్తత్వ శాస్త్రవేత్త రిపోర్టు–

హృదయాలలో శూన్యం ఎక్కువైనకొలదీ థియేటర్లు నిండిపోతాయి. అందుకోసం థియేటర్ యజమానులకు నా సలహా ఏమిటంటే ధనికవాదాన్నే ఎప్పుడూ బలపరచండి."

ఒక అల్ట్రా-మోడరన్ కవీంద్రుడు–

"నియోన్ లైటకింద పేరుకున్న చీకట్లో పట్టణ కన్య పరాభవం. అర్థమయిందా సోదరా యీ చిత్రం!"

సరికొత్త మోడల్ కారులో వెనకసీటులో కూర్చున్న భర్త భార్యతో–

"నీ మెడలో నెక్లెస్ ఎలా మెరుస్తోందో."

(భార్య) "బ్లాక్‌మార్కెట్ సంపాదన రాత్రుళ్ళే మెరుస్తుందిటగా!"

కృష్ణాబారేజిమీద నుంచున్న ఓ కృష్ణమూర్తి స్వగతం—

"ఇక్కడనుంచి దుమికితే చచ్చిపోతానని గ్యారంటీ వుందా? నేను దూకి చావనా లేకపోతే నా అప్పులవాణ్ని యిక్కడకు తీసుకొచ్చి తోసెయ్యనా? ఏది కర్తవ్యం?"

విదేశాలనుండి కొత్తగా తిరిగి వచ్చిన ఒక ఆఫీసరు –

"స్కౌండ్రల్. దూరంగా వుండు. మరీ మీదకు వస్తున్నాడు చూడండి మురికి వెధవ. అబ్బ కంపు, మాసినబట్టలూ, ఒళ్ళంతా దుమ్మూ వీడూ....పోనీ యిస్త్రీ చేసిన శుభ్రమైన చొక్కా, పాంటూ తొడుక్కొని అడుక్కోకూడదూ....బ్లడీబెగ్గర్, సభ్యత తెలియని దేశం."

ఒక వేశ్య మరొకతెతో—

"చూడవే ఆ ప్లీడరుగారు మన్ని చూసి మొహం చిట్లించుకుని ఎలా వెళ్ళుతున్నాడో-హాట్టి నీతివాసన కొడుతూ ! మొగుడు పోగానే చెల్లెల్ని చేరదీసి ఆస్తి అంతా కాజేసి తగిలేశాడు పెద్దమనిషి !"

ఒక అరవైయేళ్ళ వృద్ధనారి సగర్వంగా చూడవచ్చిన చుట్టంతో –

"నాకు పదముగ్గురు సంతానం నాయనా ! ఆరుగురు మగపిల్లలు. అందరూ అనేవారు నువ్వెంత అదృష్టం చేసుకున్నావే అని. మా ఆయన గుమాస్తా పనిచేసి రిటైరయారు. మా పెద్దబ్బాయి కోర్టులో గుమాస్తా, రెండోవాడు మున్సిపల్ ఆఫీసులో గుమాస్తా, మూడోవాడు కో-ఆపరేటివ్ సొసైటీలో గుమాస్తా. నాలుగోవాడు బియ్యంమిల్లులో గుమాస్తా. అయిదోవాడు ఎక్సయిజ్ ఆఫీసులో గుమాస్తా. ఆరోవాడు కిరాణాకొట్టులో గుమాస్తా. అందరూ అరవై డెబ్భై కరకులు తెచ్చుకుంటున్నారు. వాళ్ళకి తామరతంపరలా పిల్లాజెల్లా....ఇంక పెద్దమ్మాయి మొగుడు రైల్వేలో గుమాస్తా. రెండో అల్లుడు .... (చుట్టం చెవులు మూసుకొన్నట్టు ఆవిడకు తెలియదు.)

వివిధ శబ్దాలు –

సోడా సోడా....'కాయ్‌రాజా కాయ్ చూస్తే లేదు కాస్తేవుంది....' అర్జంటుగా యివ్వండి కొంచెం స్పైనేడ్....మీ కొత్త కాంట్రాసెప్టివ్‌లు దొరుకుతాయాండీ.... యన్. టి. రామారావు ఎంత బాగున్నాడే శ్రీకృష్ణుడిలాగ....ఏయ్ బుద్ధిలేమా లారీకిందపడి చావాలని వుందా ? .... హలో

హలో స్టాక్ ఎక్ఛేంజీకి.... షేర్లు ఎలా వున్నాయి? .... వంతెనకింద ఎవర్నో పొడిచి చంపారట ఘోరం.... ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ రెండుగంటలు లేటు.... సోజా రాజకుమారీ సోజా....

భరతవాక్యం -

రాత్రి 9 గంటలకు రమ్మంటుంది పట్టణం. రంగువేసుకున్న మొహం రాకాసివంటి అహం మిరుమిట్లు కొలిపే నవ్వుతో మెత్తగా కౌగలిస్తుంది నిన్ను.

అభిరుచీ వ్యక్తిత్వం చచ్చి అమాంతం మూస్తావు కన్ను.

(ఆంధ్రప్రభ వీక్లీ 1961)